క్లుప్తంగా

రెవెన్యూ సదస్సులు ప్రారంభం



తహసీల్దార్‌కు వివరిస్తున్న వీఆర్వో

సైదాపురం: రామసాగరం గ్రామంలో బుధవారం తహసీల్దార్ శ్రీనివాసులు అధ్యక్షతన రెవెన్యూ సదస్సు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సదస్సుల ద్వారా రెవెన్యూ సమస్యలు వెంటనే పరిష్కారమవుతాయన్నారు. అనంతరం సమస్యలపై రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు.ఆర్ఐ అశ్వర్థనారాయణ, వీఆర్వో సుబ్బయ్య పాల్గొన్నారు. చాగణం, రాజుపాళెం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు గురువారం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సూళ్లూరుపేట రూరల్: సూళ్లూరుపేట మండలం మంగళపాండు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద స్వచ్ఛ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో 68 మంది కంటి పరీక్షలు చేసుకోగా, అందులో 38 మందిని ఉచిత కంటి శస్త్రచికిత్సకు ఎంపిక చేశామని సంస్థ అధ్యక్షుడు ఎం.మోహన్ తెలిపారు. సతీష్ మొదలి, వైద్యులు రజనీకాంత్, హరీష్, శిబిరం కోఆర్డినేటర్ముని పాల్గొన్నారు.

హిమతేజకు అంతర్జాతీయ పతకం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఆసియా జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ – 2023లో రిలే పరుగు పందెంలో హిమతేజ మూడో స్థానం సాధించాడని నెల్లూరు జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.వెంకటేశ్వర్లు, విజయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సౌత్ కొరియాలో జరుగుతున్న ఏషియన్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో 4100 మీటర్ల రిలే పరుగు పోటీల్లో ఉమ్మడి నెల్లూరు జిల్లా చిల్లకూరుకు చెందిన వలిపి హిమతేజ మూడో స్థానం సాధించాడని వివరించారు. యువ అథ్లెట్ అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించడంపై ఒలంపిక్ అసోసియేషన్, వివిధ క్రీడా సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు.

గీత కార్మికుల సంక్షేమమే లక్ష్యం



ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న నేతలు

సైదాపురం: కల్లు గీత కార్మికుల సంక్షేమమే తమ లక్ష్యమని జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోసూరు రాజశేఖర్ గౌడ్ అన్నారు. పోక్కందల గ్రామంలో ఇటీవల కల్లుగీత కార్మికుడు చెట్టుపై నుంచి జారిపడి గాయపడిన అంతటి రత్నయ్యను బుధవారం పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రమాదవశాత్తు గాయపడిన రత్నయ్య కుటుంబాన్ని అన్ని విధాలుగా అందుకుంటామన్నారు. రూ.10వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. ఆయన వెంట గౌడ సంఘం అధ్యక్షుడు తోట ప్రభాకర్‌గౌడ్, సభ్యులు రాజగౌడ్, జనార్దన్‌గౌడ్, చిన్న గోవిందయ్య, ప్రసాద్, సుబ్రమణ్యం, దశయ్య, సుబ్బారావు, కేశవులు, అంకయ్య పాల్గొన్నారు.

భూమిలేని వారి గుర్తింపుపై గ్రామసభ



జనాభిప్రాయం తీసుకుంటున్న వీఆర్ఓ

చిల్లకూరు: భూమిలేని నిరుపేదలను గుర్తించేందుకు అంకులపాటూరు గ్రామంలో బుధవారం గ్రామసభను నిర్వహించారు. ఇటీవల గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీలు తమకు సాగు చేసుకునేందుకు సెంటు భూమి కూడా లేదని రొయ్యల సాగు చేసుకునే దగ్గర ఉన్న భూమిని పేదలకు పంపిణీ చేయాలని గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్‌ను పేదలు కోరారు. ఆర్డీఓ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు గ్రామసభను సర్పంచ్ వజ్రమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ త్వరలో సర్వేయర్ ద్వారా రొయ్యల గుంత వద్ద ఎంత భూమి ఉందనే విషయాలను గుర్తించి అధికారులు నివేదిక ఇస్తామని తెలిపారు. వీఆర్ఓ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్ పాల్గొన్నారు.

ప్రత్యేక విద్యుత్ అదాలత్ రేపు

కోట: విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక ప్రత్యేక విద్యుత్ అదాలత్ ఈనెల 9న కోటలోని రెడ్డి సంఘ భవనంలో నిర్వహిస్తున్నట్లు కోట సబ్‌డివిజన్ ఏడీ వరప్రసాద్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఏపీ దక్షిణ ప్రాంత విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు హాజరవుతారన్నారు. విద్యుత్ సమస్యలు, అపరిష్కృతంగా ఉన్న వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు.

కొండంత భరోసా ఆర్బీకేలు



మాధవయ్యపాలెంలోని రైతు భరోసా కేంద్రం



రైతులకు సబ్సిడీపై యూరియాను అందజేస్తున్న ఏడీ, ఏఓ (ఫైల్)

■ దక్కిలి మండలం దేవులపల్లి గ్రామానికి చెందిన మాదమాల నారాయణరెడ్డి అనే రైతు తనకు చెందిన పొలంతో పాటు బంధువుల సంబంధించిన 25 ఎకరాల పొలంలో ఖరీఫ్ కింద వరి, వేరుశనగ పంటలను సాగు చేస్తున్నాడు. ఇతను గతంలో పొలం సాగు కోసం అత్యధికంగా ఖర్చు చేయాల్సి ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత రైతు భరోసా కేంద్రం ద్వారా ట్రాక్టర్, వేరుశనగ హార్వెస్టర్, ట్రాక్టర్ ట్రక్కులను సబ్సిడీపై తీసుకున్నారు. దీంతో అతను నేడు సాగు ఖర్చులు తగ్గించుకుని పంట సాగుబడి చేస్తున్నాడు.

దక్కిలి మండలంలో ..

రైతు భరోసా కేంద్రాలు	:	14
ఆర్బీకేల నిర్మాణ ఖర్చు	:	రూ.2కోట్ల 94 లక్షలు
మండలంలో సీహెచ్‌సీ గ్రూపులు	:	20
సబ్సిడీపై పనిముట్ల కోసం	:	రూ.3కోట్లు
ఆర్బీకేల్లో ఎరువులు	:	2,800 మెట్రిక్ టన్నులు
రైతుల సంఖ్య	:	5,652
వైఎస్సార్ రైతు భరోసా మొత్తం	:	రూ.4కోట్ల 23 లక్షలు
8 వరికోత యంత్రాల వ్యయం	:	రూ.2కోట్లు

- రైతన్నకు వెన్నుదన్నుగా రైతు భరోసా కేంద్రాలు
- అందుబాటులో ఎరువులు, విత్తనాలు
- సబ్సిడీతో వ్యవసాయ పరికరాలు

దక్కిలి: గతంలో వ్యవసాయ పనులు రైతులకు కడు భారంగా ఉండేది. రైతులను పట్టించుకునే పాలకులు కరువై ఆదుకునే దిక్కు లేకుండా ఉండేది. వర్షం కోసం ఎదురుచూడడంతో పాటు పంట నష్టం కోసం ప్రభుత్వం వైపు రైతులు చూసేవారు. అప్పట్లో రైతులకు మొక్కుబడిగా పథకాలు అమలు జరిగేవి. అయితే జగనన్న ప్రభుత్వం వచ్చాక రైతన్నకు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తుండడంతో అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయి. దీంతో నేడు వ్యవసాయాన్ని కష్టంగా కాకుండా ఇష్టంగా చేసుకుంటూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. ఆర్బీకేల ద్వారా ఆయా గ్రామాల్లో రైతులు వ్యవసాయ సలహాలు, సూచనలు పొందుతున్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతన్నలను ఆర్థికంగా చూడాలన్న లక్ష్యంతో సరికొత్తగా నూతనంగా ప్రవేశపెట్టిన సచివాలయాలకు అనుబంధంగా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ (వీఏఏలు)ను నియమించారు. వీరు ఆయా ఆర్బీకేలలో అందుబాటులో ఉంటూ రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తూ పంట దిగుబడులు పెంచేందుకు అవగాహన కల్పిస్తున్నారు.

ఆర్బీకేల సేవలు ఇలా..

రైతులకు మరింతగా వ్యవసాయ సేవలు అందించాలన్న లక్ష్యంతో ఏర్పడిన ఆర్బీకేల్లో పనిచేస్తున్న సిబ్బంది ఎన్నో సేవలను అందిస్తున్నారు. ఆర్బీకేలలో మల్టీ ఫంక్షనల్ కియోస్కల ద్వారా రైతులకు కావాల్సిన వసతులను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు.అక్కడే ఈక్రాప్ బుకింగ్ జరుగుతుంది. దీంతో సబ్సిడీపై ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు, యంత్ర పరికరాలు ప్రభుత్వం అందజేస్తోంది. అకాల వర్షాలు, కరువు వంటి విపత్తులు సంభవిస్తే రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద పంట నష్టం కింద రైతులకు సకాలంలో ఆర్థిక సాయం అందజేస్తున్నారు. ఇక రైతు భరోసా కేంద్రాల్లో రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు స్థానికంగానే వరి ధాన్యం విక్రయించుకునే అన్నదాతలకు అవకాశాలు కల్పిస్తున్నారు.

రైతులు పంట బీమాను రైతు భరోసా కేంద్రాల్లో చేయించుకుంటున్నారు. మరో వైపు సిబ్బంది భూసారా పరీక్షలు పొలాల్లో నిర్వహించడం వల్ల రైతులు ఏ మోతాదులో ఎరువులు వేసుకోవాలో, తెలుసుకోవడం వల్ల పంట దిగుబడి ఖర్చులు తగ్గించుకోగలుగుతున్నారు.

ఆర్బీకేలు ఎంతో ఉపయోగం:



ఓ రైతుగా లింగసముద్రం ఆర్బీకేలో సభ్యుడిగా పనిచేస్తున్నా, గతంలో ఎప్పుడూ లేని విధంగా ఆర్బీకేలు ద్వారా రైతులకు అవసరమైన పనిముట్లు అందజేస్తున్నారు. స్థానికంగా ఇవి అందుబాటులో ఉండడం వల్ల వరికోత మిషన్ల గిరాకీ తగ్గి రైతులకు పంటకోతకు సులభంగా ఉంది. -రమణయ్యనాయుడు, లింగసముద్రం, రైతు

స్థానికంగానే వ్యవసాయ సేవలు:



గతంలో మండలానికి ఓ వ్యవసాయశాఖ అధికారి మాత్రమే పని చేసేవారు. మండలం అంతా పర్యవేక్షించడం కష్టతరంగా ఉండేది. అయితే నేడు వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉండడంతో సులభంగా వ్యవసాయ సలహాలు, ఎరువులు,విత్తనాలు పొందగలుగుతున్నాం. ఆర్బీకేల ద్వారా రైతులకు అనేక అవసరాలు తీరుతున్నాయి. - వెలికంటి చెంచయ్య, డి.వడ్డిపల్లి, రైతు

అందుబాటులో వ్యవసాయ సేవలు:



రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రతి కేంద్రంలో సిబ్బందిని నియమించడం వల్ల క్షేత్ర స్థాయిలో రైతులకు సకాలంలో వ్యవసాయ సేవలు అందుబాటులోకి వచ్చాయి. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, పచ్చిరొట్ట విత్తనాలు అందిస్తున్నాం. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి రైతులు పొందేలా పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. -విజయభారతి, ఏఓ, దక్కిలి

క్రమబద్ధీకరణ హర్షణీయం...

కాంట్రాక్టు ఉద్యోగులను ముఖ్యమంత్రి రెగ్యులరైజ్ చేయడంతో వారి ఆనందం శాశ్వతంగా నిలిచిపోనుంది. దాదాపు పాతికేళ్లుగా క్రమబద్ధీకరణ కోసం ఎదురుచూస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల జీవితాలకు వెలుగువచ్చింది. దీంతో కాంట్రాక్ట్ ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పాత పింఛన్‌కు సమానంగా ఏపీ జీపీఎస్ అమలుకు ఆమోదం తెలపడంతో సీపీఎస్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. - వెంకటగిరి

సీఎం జగన్‌కు రుణపడి ఉంటా..



రాష్ట్రంలో ఏళ్ల తరబడి పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని, పాదయాత్రలో ఇచ్చిన హామీకి కట్టుబడి కేబినేట్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణకు నిర్ణయం తీసుకోవడం విశ్వసనీయతకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మారుపేరని చెప్పారు.

- విజయకుమార్, ఏపీ ఫార్మసిస్ట్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి, వెంకటగిరి

కాంట్రాక్ట్ ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ తీసుకున్న నిర్ణయం కాంట్రాక్ట్ ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపాయని, పాదయాత్రలో చెప్పిన మాటను నేడు నిజం చేయడం హర్షణీయమని, ప్రతి కాంట్రాక్ట్ ఉద్యోగి జీవితాంతం రుణపడి ఉంటారన్నారు.

-శ్రీనివాసులు ఫార్మసిస్ట్, వెంకటగిరి

గడప గడపకూ జగనన్న ఆశయాలు



ఎమ్మెల్యే కిలివేటికి పూలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

●సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేటటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలను గడప గడపకూ తీసుకెళుతున్నామని, సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం సరికొత్త చరిత్ర సృష్టిస్తున్నట్లు సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పేర్కొన్నారు. విన్నమాల సచివాలయం పరిధిలోని పెరికిలింపాటి కండ్రిగ, కమ్మవారిపాళెం గ్రామాల్లో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కర్పూరహారతులతో గ్రామస్తులు పూల వర్షం కురిపిస్తూ ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి బుక్‌లెట్‌లను అందజేశారు. రెండు గ్రామాలకు ప్రధాన సమస్యగా ఉన్న రహదారుల నిర్మాణం తప్పక చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. విన్నమాల గ్రామ పంచాయతీ సర్పంచ్ వాకాటి సోమశేఖర్, ఎంపీటీసీ బసివిరెడ్డి హరిరెడ్డి, ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఒట్టురు కిషోర్‌యాదవ్, కామిరెడ్డి రాజారెడ్డి, బైనా మల్లికార్జున రెడ్డి, కటకం జయరామయ్య, మెస్ భాస్కర్‌రెడ్డి, జలదంకి వెంకటకృష్ణారెడ్డి, పాపారెడ్డి చంద్రారెడ్డి, పి.రాహుల్ పాల్గొన్నారు.

వివాహ వేడుకలో ఎమ్మెల్యే కిలివేటి



నూతన వధూవరులతో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేటటౌన్: వైఎస్సార్‌సీపీ నేత, ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి సోదరుడు తంబిరెడ్డి సాయిరెడ్డి కుమార్తె వివాహానికి ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. నాయుడుపేట కేఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం జరిగిన వివాహ వేడుకలో ఎమ్మెల్యే కిలివేటి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోండి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

గూడూరు: వీఆర్వోపై దాడి చేసిన వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, వీఆర్ఓల అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు గిద్దలూరు రమణయ్య పేర్కొన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట బుధవారం సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసిన అనంతరం ఆర్డీఓ కిరణ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. రమణయ్య మాట్లాడుతూ బాలాయపల్లి మండలం రామాపురం గ్రామ రెవెన్యూ అధికారి మేకాలయ్య విధుల్లో ఉండగా, అతనిపై కొందరు దాడికి పాల్పడ్డారన్నారు. వారిపై వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అసోసియేషన్ ప్రతినిధులు బూదాటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు



కోట: సీహెచ్‌సీలో వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

●ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

కోట: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్య, వైద్యరంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. బుధవారం కోటలో సామాజిక ఆరోగ్యకేంద్రం అదనపు భవన నిర్మాణాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో అసమానతలు తగ్గించి బడుగు, బలహీన వర్గాలు ఆర్థిక సాధికారత సాధించే విధంగా నాలుగేళ్లలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని తెలిపారు. పేదలు వైద్యం చేసుకునేందుకు ఆరోగ్యశ్రీ ద్వారా అన్ని రకాల వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు ప్రధాన కేంద్రంగా ఉన్న కోట సీహెచ్‌సీకి రూ.1.93కోట్లతో అదనపు భవనాలు నిర్మించి అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. అనంతరం కోటలో జరుగుతున్న ఆక్రమణల తొలగింపు, రోడ్ల అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ వెంకటరమణమ్మ, ఎంపీటీసీ సభ్యుడు మొబీన్, సన్నారెడ్డి చెంచురాఘవ రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, సాయిప్రసాద్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, సుధారెడ్డి, జగదీష్ పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం

వాకాడు: రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం విద్యా, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు అన్నారు. బుధవారం ఆయన వాకాడు ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో నిర్మిస్తున్న నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వాకాడులో రూ.5.13 కోట్లతో ఆధునాతన టెక్నాలజీ వసతులతో కూడిన ఆస్పత్రిని ఏర్పాటు చేస్తోందన్నారు. పేదలు బాగుండాలన్న సదుద్దేశంతో జగనన్న అనేక మంచి కార్యక్రమాలు చేస్తుంటే ప్రతిపక్ష నేతలు జీర్ణించుకోలేక బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు జగనన్న ప్రభుత్వాన్నే మళ్లీ ఆశీర్వదించాలని ఎదురు చూస్తున్నారన్నారు. నేతలు పెళ్లూరు కోటేశ్వరరెడ్డి, యరటపల్లి మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

చెంగాళమ్మ బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తమిళనాడు మంత్రి గాంధీ, ఎమ్మెల్యేలు

సూళ్లూరుపేట: పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి బ్రహ్మోత్సవాలను ఈనెల 8 నుంచి 14 నిర్వహించనున్న నేపథ్యంలో తమిళభాషలో ముద్రించిన పోస్టర్‌ను తమిళనాడు టెక్స్‌టైల్స్ మినిస్టర్ ఆర్ గాంధీ, గుమ్మిడిపూండి ఎమ్మెల్యే టీజే గోవిందరాజన్, ఆవిడై ఎమ్మెల్యే ఎస్ఎం నాజర్, తిరుత్తణి ఎమ్మెల్యే ఎస్ చంద్రన్, తిరువళ్లూరు ఎమ్మెల్యే వి రాజేంద్రన్, పూందమల్లై ఎమ్మెల్యే ఏ కృష్ణస్వామి చేతుల మీదుగా బుధవారం చెన్నైలో ఆవిష్కరించారు. ఆలయ కమిటీ బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను వారికి అందజేసి ఆహ్వానించారు. ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ కళత్తూరు శేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రమేష్, నేతలు కోడి ప్రకాష్, కళత్తూరు కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు రాపూరు మండల అధ్యక్ష ఎన్నిక

రాపూరు: రాపూరు ఎంపీపీ ఎన్నిక గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వీర్రాజులు తెలిపారు. ఎంపీపీ చెన్ను బాలకృష్ణారెడ్డి మృతిచెందడంతో ఎంపీపీ స్థానం ఖాళీ ఏర్పడింది. ఈ ఖాళీ భర్తీ కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గురువారం ఉదయం 11గంటలకు చేతులెత్తే విధానంలో ఎంపిక చేస్తారని తెలిపారు. మండలంలో 13 ఎంపీటీసీలు ఏకగ్రీవంగా వైఎస్సార్‌సీపీ తరపున ఎన్నికయ్యారు. చెన్ను బాలకృష్ణారెడ్డి మృతితో 12 మంది సభ్యుల్లో ఒకరిని ఎంపీపీగా ఎన్నుకోనున్నారు.

ఇసుక రీచ్ తవ్వకాల పరిశీలన

వాకాడు(చిట్టమూరు): మెట్టు గ్రామం వద్ద స్వర్ణముఖి నదిలోని ఇసుక తవ్వకాల గోతులో పడి ఓ వ్యక్తి మృతిచెందడంతో బుధవారం చిట్టమూరు మండల తహసీల్దార్ శ్రీనివాసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆయన ఇసుక రీచ్‌లను పరిశీలించి నదిలో ఏర్పాటు చేసిన గ్రావెల్ రహదారులను జేసీబీతో తీసివేయించారు.

చంద్రప్రభ వాహనంపై ప్రసన్న వేంకటేశుడు



లక్ష్మీ సంవాదం సేవ తిలకిస్తున్న భక్తజనం

గూడూరు: స్థానిక ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం చంద్రప్రభ వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం విశేష పూజలు నిర్వహించి, లక్ష్మీ సంవాదం, ముసుగుల సేవలను అత్యంత వైభవంగా నిర్వహించారు. రాత్రి చంద్రప్రభ వాహనంపై ఊరేగారు.

కోలాహలంగా పారువేట ఉత్సవం



పారువేట ఊరేగింపుగా వెళుతున్న కరిమాణిక్య స్వామి

నాయుడుపేటటౌన్: తుమ్మూరు గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్యస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామివార్ల పారువేట ఉత్సవాలను టీటీడీకి చెందిన వేదపండితుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన సప్పరంపై స్వామి, అమ్మవార్లను కొలువుదీర్చి గ్రామ సమీపంలో పాఠశాల ఆవరణలో స్వామివారు వేటకు వెళ్లే ఘట్టాలను వేదపండితులు కోలహలంగా నిర్వహించారు.

బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివార్లకు గురువారం ఉదయం ఆలయం వద్ద చక్రస్నానం నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్‌లు తెలిపారు. రాత్రి ధ్వజావరోహణం జరపనున్నట్లు వివరించారు.